# 20. సిల్వర్ జూబ్లీ ప్రోగ్రెస్ రిపోర్టు!

గడచిన పాతికేళ్ళలోనూ స్వతంత్ర భారతం అన్ని రంగాల్లోనూ అపూర్వంగా పురోగమించింది. అనేక రంగాలలో సర్వతోముఖాభివృద్ధి సాధించబడింది. నక్సలైట్లు తప్ప సర్వులూ ఈ పురోగమనాన్ని గుర్తించి కీర్తిస్తూండటం శుభ సూచకం. నక్సలైట్లు అడవులలో వుంటారు గనుక వారికి ఈ అభివృద్ధి కనుపించకపోవటం సహజం. వారికి మనహృదయ పూర్వక సానుభూతి.

**ఉత్పత్తి**

రాజకీయ సంక్షోభాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. అనేక మంత్రివర్గాలు కైమా చేయబడ్డాయి. యువనాయకుల ఉత్పత్తికి ఆటంకంగా ఉన్న ముసలినాయకు లనేక మంది ఉప్పు పాతర వేయబడ్డారు. ఇందిరాజీ ప్రభావ ఉత్పత్తికి అడ్డు తగిలిన అభివృద్ధి నిరోధకు లనేకమందికి సన్యాసం ఇప్పించబడింది.

కొత్త మంత్రులతో, కొత్త మంత్రివర్గాలు గత సంవత్సరంలో అధికంగా ఉత్పత్తయినాయి. అందులో ఇందిరాజీ సృష్టించిన సరికొత్త వంగడం "బ్యాక్ వర్డ్ క్లాస్' అనేది విజయవంతంగా ప్రయోగింపబడి అద్భుత ఫలితాల నిచ్చింది.

రాష్ట్రాల మధ్య సరిహద్దు తగాదాలు, నదీజలాల పంపకం తగాదాలు వంటి అతిముఖ్య విషయాలలో ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఈ సందర్భంలో కోర్టులకుకూడా పని తగలటం ప్రశంసనీయమైన పరిణామం.

నిరుద్యోగ ఉత్పత్తిలో అపూర్వ ప్రగతి సాధించబడింది. దీన్లో నూటికి 22 వంతులు అభివృద్ధి ఉండటం గర్వ కారణం. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కేవలం పట్టభద్రుల్లోనే 23 వేల మంది నిరుద్యోగుల్ని ఉత్పత్తి చేసి కాపాడుతున్న ఘనత మనకే చెందవలసి ఉంది.

ఇంజనీర్లకు ఉద్యోగాలుకూడా దొరకనంత ఘనంగా పారిశ్రామికాభివృద్ధి సాధించాం. ప్రపంచంలో మరే దేశమూ కూడా ఈ విషయంలో మనల్ని కాదనలేదు.

**గృహ వసతి :**

ఇళ్ళు లేనివారికి ఇళ్ళు కట్టించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న అనతి కాలంలోనే గణనీయమైన విజయాలు సాధించాం. పట్టణాల్లోని స్థలాలపై పరిమితులు బిగించాం. వేలాది ఇళ్ళు కట్టించబోతున్నాం. విశాఖ జిల్లాలో ఈ స్కీం క్రింద హరిజనులకు ఇళ్ళు కట్టించి ప్రారంభోత్సవం చేయించాం ఆ మర్నాడే ఆ ఇళ్ళు పగుళ్ళు చూపటం మొదలెట్టాయంటే అది ప్రజల దురదృష్టం. గ్రహశాంతి చేయిస్తే అన్నీ అవే సర్దుకుంటాయ్. అన్నింటికి ఆ ఏడుకొండలవాడే ఉన్నాడు.

హౌసింగ్ బోర్డు ఎన్నో ఇళ్ళు కట్టిస్తూంది. అవి తంతే కూలిపోయేలా ఉన్నాయనేది కిట్టని వాళ్ళ దుష్ప్రచారం. ఇళ్ళు అలాట్ అయినవాళ్ళు ఓ అయిదారు వేలు ఉదారంగా ఖర్చుచేస్తే సరి, ఆ ఇళ్ళే ఇనప్పెట్టెలా తయారవుతాయి.

ధరలు:

ఈ అంశంలో మనం సాధించిన ప్రగతిని మరే దేశమూ సాధించి ఉండలేదు. అమెరికన్, రష్యన్ రాకెట్లుకూడా మన ధరల పురోగమన వేగం ముందు ఓడిపోతున్నాయ్.

ఈ ధరల పెరుగుదల మన ప్రజల జీవన వ్యయప్రమాణాల్లో అద్భుతమైన పెరుగుదల రావటం వలననే సంభవమైనదని పురోగమన శీలురు గుర్తించాలి. అది మన ఆర్థికాభివృద్ధికి టీపిక!

పూజ్య బాపూజీ తన జీవితమంతా నిరాడంబరతను గురించి సదా మనకు బోధించారు. ఈ ధరల పురోగమనం వలన ఏ బోధనలూ లేకుండానే మన ప్రజలు నిరాడంబర జీవితానికి, ఒంటిపూట భోజనాలకి అలవడగలగటం హర్షణీయం. ఈ పురోగమనాన్ని మరింత అభివృద్ధి చేయటం అత్యావసరం. లేకుంటే తాతాలు, బిర్లాలు, సోమానియాలు, జైన్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు తగిన లాభాలు రావటం కష్టమని దేశభక్తులంతా గుర్తించాలి

పరిశ్రమలు :

పారిశ్రామిక రంగంలో మన పురోగమనం గురించి ప్రత్యేకించి చెప్పటం అనవసరం. స్కూ్రులు,నట్లు మొదలైన స్పేర్‌పార్టుల తయారీలో ఇప్పటికే ఘన విజయాలు సాధించాం. అవకాశమున్న ప్రతి దేశాన్ని పట్టుకొని అప్పుగా భారీ ఇండస్ట్రీలు తెచ్చుకున్నాం. ఇప్పుడు వాటిమీద నష్టా లొస్తున్నా రేపు తప్పకుండా లాభాలొస్తాయి. ఆ లాభాల కోసం గోడౌన్లు కట్టించే ప్రయత్నాలుకూడా జరుగుతు న్నాయ్.

ఇంగ్లీషు దినపత్రికలు చదివే అలవాటు గల భారత పౌరులు మన పారిశ్రామికాభివృద్ధి సులువుగా గ్రహించ గలరు. ఆ యా పత్రికలనిండా ఉండే అడ్వర్టయిజ్‌మెంట్లు చూసి మన ప్రయివేటు రంగంలోని పరిశ్రమలు ఎంతగా అభి వృద్ధి చెందుతున్నదీ సులువుగా గ్రహించి ధన్యులు కాగలరు.

ఆరోగ్యం :

మందుల ఉత్పత్తి రోగుల ఉత్పత్తితో సమానంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోబడ్డాయి. "మందులపై నిషేధంగల అనేక రాష్ట్రాల్లో ఇటీవలే ఆ నిషేధం ఎత్తివేశాం. ఇందువల్ల కోట్లాది రూపాయల ఎక్సైజు ఆదాయం సంపా దించగలుగుతున్నాం. మన మందుల రంగంలో ఉత్పత్తి మూడు బ్రాందీబుడ్లు, ఆరు బీరు బాటిల్సుగా పురోగ మిస్తున్నది.

సుగర్ కంట్రోల్ పెట్టి డయాబెటిస్ రోగులకు అమోఘ సేవ చేశాం. వారికిది మరువరాని ఉపకారం. వారు తమ దేహంలో సుగర్ ఎక్కువయే ప్రమాదం తొలగినందున నిశ్చింతగా నిద్రపోవచ్చును.

ఈలోకంలో ఉండేందుకు అనర్హులైనవారిని అర్జంటుగా పై లోకాలకు టపా కట్టించే దివ్యౌషధాలు అడపాదడపా మద్రాసు వంటి రాష్ట్రాల నుండి విడుదలవుతూండటం హర్షణీయం.

ఫామిలీ ప్లానింగులో మనం సాధించిన విజయాలు, చేసిన ప్రచారం ప్రపంచ చరిత్రలోనే అపూర్వం కోట్ల రూపాయల ఖర్చుతో ఎందరో ఆఫీసర్లను, ఉద్యోగులను డాక్టర్లను, నర్సులను హోర్డింగులు రాసే ఆర్టిస్టులను, అడ్వర్టయిజుమెంట్లు ప్రచురించే సావనీర్ కంపెనీలను పోషిస్తున్నాం, నిరోధ్‌లు పిల్లకాయలకుకూడా దొరికేటంత విరివిగా ప్రచారంలోకి తెచ్చాం.

అయినా మన జనాభా పెరుగుదల శాతం గతంలో కన్నా ఇటీవలే అధికంగా ఉందంటే అది మన ఖర్మ. ఇందుకు విరుగుడుగా "ఇద్దరు లేక ముగ్గురు చాలు" అనే నినాదానికి బదులుగా త్వరలోనే "ఒకరు లేక ఒకటిన్నర చాలు" అనే నవ నినాదాన్ని ప్రపంచంలోనికి తేనున్నాం.

**విద్య :**

విద్యారంగంలో మన ప్రగతికి ప్రత్యేక సాక్ష్యం నిరుద్యోగుల శాతం పెరగటమేనని విజ్ఞులు గ్రహించగలరు. మన విద్యాలయాలు, యూనివర్శిటీలు అసాధారణమైనవీ, ప్రత్యేకతలు గలవీనూ.

విద్యార్థులు కేవలం పుస్తకాల పురుగులుగా మిగిలిపోకుండా అడపాదడపా రాజకీయాల్లో కాలుబెట్టి కాళ్లు విరగ్గొట్టుకోవడం మనదేశం ప్రత్యేకత. విద్యా రంగంలో మనం సాధించిన పురోగతి వలన మన విద్యాలయాలు ఏడాది పొడుగునా పని చేయనవసరం లేని పరిస్థితి కల్పించబడింది. ఈ కారణం వలననే మన విద్యాలయాలు చీటికి మాటికి మూతపడుతున్నాయని విజ్ఞులు గ్రహించగలరు.

మన విద్యార్థులు బహు బుద్ధిమంతులు. విద్యా విధానంలో ఎన్నెన్ని మార్పులు తెచ్చినా కిమ్మనకుండా ఆ స్రొప్పి మింగి అయినా సరే పరీక్షలు రాసిగానీ, కాపీలు కొట్టిగానీ తప్పనిసరిగా ప్యాసవుతూండటం గర్వకారణం. తప్పిన వారిలో ఏ కొద్దిమందో తప్ప ఆత్మ హత్యలు చేసుకోక పోవటం హర్షణీయం.

**సాంస్కృతికాభివృద్ధి :**

గత పాతికేళ్లల్లోనూ మన సంస్కృతీ రంగం అపూర్వంగా పురోగమించిందని మీ ఊళ్లో గోడల మీది సినీ పోస్టర్లు చూస్తే మీకే తెలుస్తుంది.

(ఆగస్టు 1972)